RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్ DESHA TIMES

తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్ DESHA TIMES

16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | ఆగస్టు 16 ఆదివారం 2026 | సంపుటి : 16 | సంచిక : 193 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా


NALGONDA | SUNDAY AUGUST 16 2026 | VOL:16 | ISSUE: 193 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

**ఆయా రంగాల్లో స్వయంసమృద్ధితో వికసిత భారత్ సాధ్యం**

**ఆర్థిక,సామాజిక ఎదుగుదలకు చోదకశక్తి కావడం తథ్యం**

**సప్తధార సందేశం ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ**



**న్యూఢిల్లీ,ఆగస్ట్15**

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం దేశ భవిష్యత్తు ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్', స్వయంసమృద్ధి సాధించడమే లక్ష్యంగా, దేశాన్ని నడిపించే ఏడు ప్రాథమిక శక్తులను 'సప్తధార' పేరుతో ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడు రంగాలు భారతదేశ రాబోయే ఆర్థిక, సామాజిక

(మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం: సీఎం రేవంత్



**గోల్కొండలో జాతీయ జెండాను ఎగురవేసిన సీఎం రేవంత్ రెడ్డి**

**దెబ్బతిన్న వ్యవస్థలను32 నెలల్లో గాడిలో పెట్టామని ప్రకటన**

**రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని సీఎం వ్యాఖ్య**

**బలమైన ప్రజాస్వామిక భారత్ నిర్మాణానికి పిలుపు**

గోల్కొండ కోటలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే ఆయుధం లేని యుద్ధం భారత స్వాతంత్ర్య పోరాటమని అన్నారు. అహింసతోనూ విజయాన్ని సాధించవచ్చని మహాత్మాగాంధీ నిరూపించారని చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు.స్వాతంత్ర్యం జీవనానికి ఆధారమని, దానికి వెల కట్టలేమని గాంధీజీ చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం ద్వారా దేశంలోని వివిధ రంగాల అభివృద్ధికి గత ప్రభుత్వాలు కృషి చేశాయని

(మిగతా 2వ పేజీలో..)

## జెన్-జీ శక్తితోనే మార్పు.. అవినీతి, కులాలపై పోరాటమే నిజమైన స్వేచ్ఛ: తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో విజయ్

**చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**అవినీతిని అంతమొందించడం రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనన్న విజయ్**

**స్వాతంత్ర్య సమరయోధుల పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్టు ప్రకటన**

తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ తన తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రాజకీయ ప్రత్యర్థులకు బలమైన హెచ్చరికలు జారీ



# అర్హులందరికీ రేషన్ కార్డులు.. నిరంతర ప్రక్రియ: మంత్రి ఉత్తమ్

**అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటన**

**ఇప్పటికే 16 లక్షల కొత్త కార్డులు జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్న బియ్యం ఉచితంగా పంపిణీ**

**స్మార్ట్ రేషన్ కార్డు కుటుంబానికి గౌరవం, భరోసా అని వ్యాఖ్యలు**



రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

(మిగతా 2వ పేజీలో..)

## బ్రిటీష్ కాలం నాటి కుట్రలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది: కవిత

**చరిత్రను అర్థం చేసుకున్నవారే దేశ భవిష్యత్తును అద్భుతంగా నిర్మించగలరన్న కవిత**

**బ్రిటీష్ వారి విధానాల వల్లే దేశంలో కుల వ్యవస్థ మరింత తీవ్రమైందని వ్యాఖ్య**

**ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారని మండిపాటు**

ఆంగ్లేయుల పాలనలో జరిగిన దారుణాలు, సమాజాన్ని ముక్కలు చేయడానికి వారు అవలంబించిన 'విభజించి పాలించే' కుట్రల గురించి నేటి తరానికి పూర్తి స్థాయిలో తెలియాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. మన చరిత్రను

(మిగతా 2వ పేజీలో..)



## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు మళ్లీ దూరంగా ఖర్గే, రాహుల్.. పాత వివాదమే కారణమా?

**ఎర్రకోటలో జరుగుతున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఖర్గే, రాహుల్ దూరం**

**ప్రధాని మోదీ నేతృత్వంలోని కార్యక్రమానికి వరుసగా రెండో ఏడాదీ గైర్హాజరు**

2024లో రాహుల్‌కు వెనుక వరుసలో సీటు కేటాయించడంపై చెలరేగిన వివాదం ప్రతిపక్ష నేతగా



## ఇండోనేషియాలో 7.7 తీవ్రతతో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ!

**తీరప్రాంత ప్రజలను ఖాళీ చేయాలని ఆదేశాలు**

**సముద్రంలో 10 కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రం**



# 'ఆయన చెప్పింది నిజమే'.. రాజగోపాల్ రెడ్డికి కేటీఆర్ మద్దతు!

**అవినీతిపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆరోపణలు**

**రూ.5 లక్షల ఇంటికి 500 నిబంధనలంటూ మండిపాటు**

**భారీ దోపిడీ జరుగుతోందని ఆరోపణ**

**రాజగోపాల్ మాటలతో ఏకీభవిస్తున్నానన్న కేటీఆర్**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు**



కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన తీవ్ర ఆరోపణలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. అభివృద్ధి పేరుతో కొందరు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షల కోట్లు దోచుకుంటున్నారని రాజగోపాల్ చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్ అన్నారు. పేదలకు ఇల్లు కట్టుకోవడానికి

(మిగతా 2వ పేజీలో..)

తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం: సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛను అందించడంతో పాటు విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. తెలంగాణ భవిష్యత్తుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32 నెలలు పూర్తయ్యాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న వ్యవస్థలను ఒక్కొక్కటిగా గాడిలో పెడుతున్నామని చెప్పారు. తమ సంక్షేమ పథకాలను కేవలం ఆర్థిక లెక్కలతో చూడటం లేదని స్పష్టం చేశారు. సంక్షేమంలో మానవీయత ఉందని, పేదల పట్ల బాధ్యత ఉందని అన్నారు. వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న తపనతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల కోసం లేదా మొక్కుబడిగా సంక్షేమాన్ని అమలు చేయడం లేదని స్పష్టం చేశారు.32 నెలల్లో ప్రభుత్వం చేసిన కృషి ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం పెరగడం దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే తెలంగాణ తలసరి ఆదాయం 91 శాతం అధికంగా ఉందని చెప్పారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నది తమ ప్రభుత్వ నమ్మకమని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాలని, పరస్పర గౌరవం, దేశభక్తి విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. అసమానతలు లేని, శాంతి, సౌభ్రాతృత్వాలతో కూడిన బలమైన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించడమే సమరయోధులకు నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి పౌరుడికి సమన్యాయం, సమానత్వం, స్వేచ్ఛ అందేలా నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కర్తవ్యనిష్ఠతో, అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు.. నిరంతర ప్రక్రియ: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందని, ఇది ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గతంలో ప్రజలకు నాణ్యత లేని దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసేవారని, అయితే తమ ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి సన్న బియ్యాన్ని సేకరిస్తోందని తెలిపారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఆహార భద్రతకే కాకుండా, అది ఒక కుటుంబానికి ప్రభుత్వం కల్పించే గౌరవం, గుర్తింపు అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని ఎన్నో సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి 3,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించి, త్వరలోనే వారికి కూడా కార్డులు జారీ చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## బ్రిటీష్ కాలం నాటి కుట్రలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది: కవిత

(మొదటి పేజీ తరువాయి)

సరిగ్గా అర్థం చేసుకున్న వారు మాత్రమే దేశ భవిష్యత్తును అద్భుతంగా నిర్మించగలరని ఆమె అన్నారు.తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కవిత పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రెండు ప్రపంచ యుద్ధాల్లో భారతీయ సైనికులను బలవంతంగా వాడుకుని వేలాదిమంది ప్రాణాలను బ్రిటీషర్లు బలితీసుకున్నారని మండిపడ్డారు. వారు తెచ్చిన విధానాల వల్లే దేశంలో కుల వ్యవస్థ మరింత తీవ్రతరమైందని, అడవుల్లో ప్రశాంతంగా జీవించే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు.బ్రిటీష్ పాలకులు దేశం విడిచి వెళ్లినా, వారి ఆలోచనా వైఖరి మాత్రం ఇంకా ఇక్కడే ఉండిపోవడం విచారకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ మాట్లాడేవారే గొప్ప అన్నట్లుగా చూస్తూ, మాతృభాష అయిన తెలుగు మాట్లాడేవారిని తక్కువ చేసి చూడడం ఆనాటి గులాంగిరీకి నిదర్శనమన్నారు. చర్మం రంగును బట్టి మన మధ్య వైషమ్యాలు సృష్టించిన ఆనాటి మైండ్‌సెట్‌ను వీడి, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.

## జెన్-జీ శక్తితోనే మార్పు.. అవినీతి, కులాలపై పోరాటమే నిజమైన స్వేచ్ఛ: తొలి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో విజయ్

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో పాటు యువత, సామాజిక మార్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చెన్నైలోని చారిత్రాత్మక ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించిన ఆయన, రాష్ట్రంలో అవినీతిని అంతమొందించడం కూడా ఒక రెండో స్వాతంత్ర్య పోరాటం లాంటిదేనని స్పష్టం చేశారు.రాష్ట్రాభివృద్ధిలో జెన్–జీ, యువతదే కీలక పాత్ర అని పేర్కొన్న విజయ్... కులం, మతం పేరుతో ప్రజలను విభజించే సంకెళ్లను తెంచినప్పుడే దేశంలో నిజమైన స్వేచ్ఛ సాధ్యమవుతుందని అన్నారు. తమిళనాడు హక్కులు, భాషా విధానం, ఆర్థిక వాటా విషయంలో తమ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని... కేంద్ర ప్రభుత్వంతో పరిపాలనాపరమైన సహకారం ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చర్యలనైనా తీవ్రంగా నిరోధిస్తామని హెచ్చరించారు. ఇదే వేదికపై స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమం కోసం పలు కీలక ప్రకటనలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చే పింఛనును రూ. 23 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. అలాగే వీరపాండ్య కట్టబొమ్మన్, వి.ఓ. చిదంబరం పిళ్లై వంటి వీరుల వారసులకు ప్రత్యేక నిధులను ప్రకటిస్తూ, రాబోయే రోజుల్లో సుపరిపాలనతో తమిళనాడును సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తామని తెలిపారు.

# దేశ భవిష్యత్ ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

ఎదుగుదలకు చోదక శక్తులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. మొదటి ధార మాన్యుఫ్యాక్చరింగ్. దేశ తదుపరి వృద్ధి దశకు మాన్యుఫ్యాక్చరింగ్ బలమైన పునాదిగా మోడీ అభివర్ణించారు. కేవలం చిన్న విడిభాగాల తయారీకే పరిమితం కాకుండా సంపూర్ణ ఉత్పత్తుల తయారీపై భారత్ దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టేందుకు ధర, నాణ్యత, విస్తృత స్థాయి ఉత్పత్తి అనే మూడు అంశాలపై తయారీదారులు దృష్టి పెట్టాలని సూచించారు. మన ఉత్పత్తులకు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ఖచ్చితత్వంతో కూడిన నాణ్యత ఐడెంటిటీగా మారాలని చెప్పారు. సప్తధారలో రెండవది వ్యవసాయం, ఆహార భద్రత. దేశ అభివృద్ధి ప్రయాణంలో వ్యవసాయ రంగ ప్రాధాన్యతను నొక్కి చెప్పిన ప్రధాని, ఆర్థిక వృద్ధిలో ఆహార ఉత్పత్తి, వ్యవసాయం ఎప్పటికీ కేంద్రబిందువులుగా ఉంటాయని స్పష్టం చేశారు. సుదీర్ఘకాల ఆహార భద్రతను నిర్ధారించడానికి వ్యవసాయరంగాన్ని బలోపేతంచేసి, ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలు మూడవ ధారగా అభివర్ణించారు. ప్రపంచం డేటాసెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త సాంకేతికతల యుగంలోకి అడుగు పెడుతోందని, ఈ రంగాల్లో భారత్ గ్లోబల్ హబ్‌గా మారాలని పిలుపునిచ్చారు. యుపిఐ విజయం ద్వారా భారత్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఇప్పటికే ప్రపంచానికి నిరూపించిందని, ఇప్పుడు మరింత పెద్ద లక్ష్యాలను నిర్దేశించు కోవాలని చెప్పారు. అలాగే నెక్స్ట్–జెన్ టెలికమ్యూనికేషన్‌ను వేగవంతం చేస్తూ, స్వదేశీ 6జి సాంకేతికతను దేశంలోని మూలమూలకూ తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. నాల్గవ ధారగా మౌలిక వసతులు, 'గతి శక్తి' ద్వారా అనుసంధానాన్ని పెంచడంపై మాట్లాడారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, ల్యాజిస్టిక్స్ మెరుగు పరచడానికి, వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల అభివృద్ధి అత్యంత కీలకమని, వాటికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ వేగవంతమైన కనెక్టివిటీ సరికొత్త ఆర్థిక అవకాశాలను తెరుస్తుందన్నారు.ఐదవ ధారగా 'రక్షా శక్తి' నిలిచింది. రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ తయారీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక సైనిక సాంకేతికతలపై ఎక్కువ పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశద్రోహ భద్రతను గట్టిగా ఉంచడానికి ఆత్మనిర్భర్ రక్షణ రంగం ఎంతో అత్యవసరమని తెలిపారు. ఆరవ ధారగా హరిత ఇంధనాన్ని (గ్రీన్ ఎనర్జీ) ప్రధాని గుర్తించారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుతూనే భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి క్లీన్ ఎనర్జీ సాంకేతికతల్లో ఆవిష్కరణలు చాలా ముఖ్యం అని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరించడానికి, స్వచ్ఛమైన ఇంధన వనరుల వైపు వేగంగా అడుగులు వేయడానికి కృషి చేయాలన్నారు. చివరగా ఏడవ ధారగా భారతదేశం 'సాఫ్ట్ పవర్' ను ప్రధాని ఆవిష్కరించారు. భారత్ సాంస్కృతిక ప్రభావం సరిహద్దులు దాటి విస్తరించిందని చెబుతూ.. యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, క్రియేటివ్ రంగాలు భారత సాఫ్ట్ పవర్‌కు ప్రధాన స్తంభాలని వెల్లడించారు. భారతదేశ పర్యాటక రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. జాతీయ పార్కులు, సాంస్కృతిక విశేషాలు, వినోద పరిశ్రమ, వేగంగా విస్తరిస్తున్న 'కాన్సర్ట్ ఎకానమీ' పర్యాటకాన్ని బలోపేతం చేయడానికి, భారత్ గొప్ప వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికి అద్భుతమైన వేదికలని మోడీ స్పష్టం చేశారు. ఈ సప్తధార సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణ స్వయంసమృద్ధి కలిగిన వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# 'ఆయన చెప్పింది నిజమే'.. రాజగోపాల్ రెడ్డికి కేటీఆర్ మద్దతు!

(మొదటి పేజీ తరువాయి)

రూ.5–6 లక్షలు ఇవ్వాలంటే ప్రభుత్వం 500 నిబంధనలు పెడుతోందని రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. అదే సమయంలో పెద్ద మొత్తంలో దోపిడీ జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు. రాజగోపాల్ రెడ్డి ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేశారు. అభివృద్ధి పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్న వారిపై పోరాడతానని హెచ్చరించారు. తన సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని అన్నారు. పేదల ఇళ్ల విషయంలో నిబంధనలు కఠినంగా పెడుతున్న ప్రభుత్వం భారీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్నారన్న రాజగోపాల్ రెడ్డి మాటలు నిజమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలను సొంత పార్టీ ఎమ్మెల్యేలే చేస్తున్నారని చెప్పారు. తెలంగాణను రాహుల్ గాంధీ, ఏఐసీసీకి ఏటీఎంగా మార్చుకున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారీ ప్రధాని మోదీ రాష్ట్రం ఏఐసీసీకి ఏటీఎంగా మారిందని చెబుతున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. మరి అలాంటి ఆరోపణలు వస్తున్నప్పుడు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడులు జరిగినా ఆ తర్వాత ఎలాంటి చర్యలు కనిపించలేదన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు మళ్లీ దూరంగా ఖర్గే, రాహుల్.. పాత వివాదమే కారణమా?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న రాహుల్‌ను అవమానించారని అప్పట్లో కాంగ్రెస్ ఆరోపణ

గత వివాదం కారణంగానే ఈసారి కూడా హాజరు కాలేదని విశ్లేషణలు

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఢిల్లీలోని ఎర్రకోటలో జరుగుతున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ గైర్హాజరయ్యారు. వారు ఈ కార్యక్రమానికి హాజరుకాకపోవడం ఇది వరుసగా రెండో ఏడాది. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది.2024లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో తీవ్ర వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా కేబినెట్ మంత్రి హోదాలో ఉన్న రాహుల్ గాంధీకి సంప్రదాయానికి, ప్రోటోకాల్‌కు విరుద్ధంగా వెనుక వరుసలో సీటు కేటాయించారు. ఇది ప్రజలను అవమానించడమేనని అప్పట్లో ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి.అయితే, ఈవెంట్‌ను నిర్వహించిన రక్షణ మంత్రిత్వ శాఖ దీనిపై వివరణ ఇచ్చింది. ఒలింపిక్ క్రీడాకారులకు ప్రాంగణంలో చోటు కల్పించేందుకే సీటింగ్ ఏర్పాట్లలో కొన్ని మార్పులు చేయాల్సి వచ్చిందని తెలిపింది. వాస్తవానికి ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం ఇలాంటి అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష నేతకు ముందు వరుసలోనే స్థానం కల్పించాలి.గతంలో జరిగిన ఈ వివాదం కారణంగానే ఈసారి కూడా కాంగ్రెస్ అగ్ర నాయకులు ఈ వేడుకలకు దూరంగా ఉన్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వంతో ప్రతిపక్షాల మధ్య ఉన్న దూరాన్ని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది.

## ఇండోనేషియాలో 7.7 తీవ్రతతో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు జారీ!

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్నేయాసియా దేశం ఇండోనేషియాను భారీ భూకంపం వణికించింది. శనివారం తెల్లవారుజామున దేశ తీరప్రాంతంలో సముద్ర గర్భంలో 7.7 తీవ్రతతో శక్తివంతమైన భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేయడంతో తీరప్రాంత ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) ప్రకారం, భూకంపం రిక్టర్ స్కేలుపై 7.7గా నమోదైంది. సముద్ర ఉపరితలం నుంచి కేవలం 10 నుంచి 30 కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రం ఉన్నట్లు ఇండోనేషియా ఏజెన్సీ (బీఎంకేజీ) కూడా ధ్రువీకరించింది. భూ ప్రకంపనల ధాటికి సమీపంలోని ద్వీపాలు, నగరాలు తీవ్రంగా కంపించడంతో.. నిద్రలో ఉన్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.భూకంప తీవ్రత ఎక్కువగా ఉండటం, సముద్రంలో చాలా తక్కువ లోతులో సంభవించడంతో సునామీ ముప్పు పొంచి ఉందని అధికారులు తెలిపారు. భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలోని తీరప్రాంత ప్రజలు వెంటనే సురక్షితమైన, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని ఆదేశించారు. 1 నుంచి 3 మీటర్ల ఎత్తు వరకు రాకాసి అలలు తీరాన్ని తాకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం (పీటీడబ్ల్యూసీ) కూడా ఫిలిప్పీన్స్, మలేషియా, ఆస్ట్రేలియా వంటి దేశాలను అప్రమత్తం చేసింది.సమాచారం అందిన వెంటనే ఇండోనేషియా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (బీఎన్‌పీబీ) రంగంలోకి దిగింది. రెస్క్యూ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు పంపించింది. ఈ భూకంపం వల్ల పలు భవనాలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ప్రధాన భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు (ఆఫ్టర్‌షాక్స్) వచ్చే అవకాశం ఉన్నందున, శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు.పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటం వల్ల ఇండోనేషియాలో భూకంపాలు, అగ్నిపర్వతాలు సర్వసాధారణం. 2004లో ఇదే ప్రాంతంలో సంభవించిన పెను భూకంపం, సునామీ సృష్టించిన విలయం మరువకముందే మరోసారి భారీ భూకంపం రావడం ఆందోళన కలిగిస్తోంది.

తెలుగు దినపత్రిక
# దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



# రుద్రంగిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు






**రుద్రంగి ఆగస్టు15(దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఎంఆర్వో పుష్పలత, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నటరాజ్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మోతీరామ్, మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ చెలుకల తిరుపతి, గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గండి నారాయణ జెండాను ఆవిష్కరించారు. సెస్ కార్యాలయంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, గాంధీ విగ్రహం వద్ద ఉపసర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, అంబేద్కర్ విగ్రహం వద్ద వార్డు సభ్యురాలు గుగ్గిళ్ల పావని వెంకటేష్, ఇందిరాగాంధీ విగ్రహం వద్ద వార్డు సభ్యురాలు శీలం స్వాతి మీనయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, బీజేపీ కార్యాలయంలో అధ్యక్షుడు కర్ణావత్తుల వేణు, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, బీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్ పాల్గొన్నారు. అలాగే పడమటి వాడ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జంగిలి శేఖర్, గాంధీ యువజన సంఘం అధ్యక్షుడు సనుగుల గంగాధర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంచే రమేష్, ప్రభుత్వ పాఠశాలలో హెడ్‌మాస్టర్ సమ్మిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీ సరస్వతి విద్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**స్వాతంత్ర్య వేడుకల్లో పాత్రికేయులకు ఘన సన్మానం**

**దేశ టైమ్స్ :**

మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో గత 36 సంవత్సరాలుగా విద్యా సేవలను అందిస్తున్న శ్రీ సరస్వతి విద్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కరెస్పాండెంట్ ఎదులాపురం దయాకర్, ప్రిన్సిపాల్ పద్మశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి మేడిపల్లి మండలానికి చెందిన పాత్రికేయులను ముఖ్య అతిథులుగా పాఠశాల యాజమాన్యం ఆహ్వానించింది. జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్న అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అతిథులను ఆకట్టుకున్నాయి .స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఉమ్మడి మేడిపల్లి మండల పాత్రికేయులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ ఎదులాపురం దయాకర్ మాట్లాడుతూ. సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. 36 సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించేందుకు శ్రీ సరస్వతి విద్యాలయం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, పాత్రికేయులు ఉమ్మడి మేడిపల్లి ప్రెసక్లబ్ అధ్యక్షులు దయాకర్, గౌరవ అధ్యక్షులు లక్ష్మీపతి, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ప్రవీణ్ రావు, ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్, సహాయ కార్యదర్శి ఎండి రహీం, కోశాధికారి అశోక్, గౌరవ సలహాదారు ఎండి రఫీ, సభ్యులు వజ్ర లింగం, గంగ నర్సయ్య, అనిల్, చిరంజీవి, మహేష్, ఆనంద్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడ మున్సిపల్ ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రాలు

**(దేశ టైమ్స్)మహబూబాబాద్/మరిపెడ,ఆగస్టు15**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసా పత్రాలు లభించాయి. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలనుపురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ఇన్చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ యాకుబ్ పాషా, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ రెడ్డిలను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎస్పీ శబరీష్ చేతుల మీదుగా వారు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావం, బాధ్యతాయుత సేవలు అందించినందుకు ఈ గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలను మున్సిపల్ అధికారులు,సిబ్బంది, ప్రజాప్రతినిధులు





అభినందించారు. అవార్డులు అందుకోవడం పట్ల షేక్ యాకుబ్ పాషా,అశోక్ రెడ్డిలు సంతోషం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు

**వలిగొండ,ఆగస్టు15(దేశ టైమ్స్):**

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన తన సిబ్బందితో కలిసి స్థానిక మెయిన్ రోడ్డుపై వాహనాల తనిఖీలో హెల్మెట్ ధరించని వారికి అపరాద రుసుము వేసి, సరైన పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ప్రతిఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.




# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలే మన స్వేచ్ఛకు పునాది

**వలిగొండ ఆగస్టు15 (దేశ టైమ్స్)**





వలిగొండ మండల పరిధిలోని లింగరాజుపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆవరణంలో గ్రామ సర్పంచ్ బొడిగే లింగస్వామి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించాడు, అదేవిధంగా గౌడ సంఘం అధ్యక్షులు గంధమల్ల గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సర్పంచ్ మాట్లాడుతూ నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఎవరో ఇచ్చిన వరం కాదు.. ఎందరో మహనీయుల ప్రాణత్యాగాల ఫలితశీ అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి పోరాడిన సమరయోధుల ధైర్యం, త్యాగం, దేశభక్తి ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులను ఎన్నటికీ మరువకూడదు.వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాలి.. బలమైన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం గ్రామ పెద్దలు యువత తదితరులు పాల్గొన్నారు

# కేరళ గ్లోబల్ హైస్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**రుద్రంగి ఆగస్టు15(దేశ టైమ్స్)**





రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని కేరళ గ్లోబల్ హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లతిక మేడం జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యత, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలు, దేశభక్తి, జాతీయ ఐక్యత గురించి వివరించారు. విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులు వివిధ స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులు, దేశభక్తిని ప్రతిబింబించేలా వేసుకున్న వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి భావాలను చాటే ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానికులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో స్వాతంత్ర్య వేడుకల సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ఘనంగా 80 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆగస్టు15(దేశ టైమ్స్ )**



వలిగొండ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలతో పాటు మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మరియు వివిధ యువజన,కుల సంఘాల ఆధ్వర్యంలో 80 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయంలో దశరథ, ఎంపీడీవో కార్యాలయంలో జలంధర్ రెడ్డి, పోలీస్ స్టేషన్లో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, పి ఎసి ఎస్ కార్యాలయంలో చైర్మన్ గరిసె రవి,వివిధ గ్రామాల్లో వచ్చిన సంఘాల నాయకులు మరియు ఆయా గ్రామాల సర్పంచులు త్రివర్ణ ప్రతాకాన్ని ఎగరవేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది త్యాగమూర్తుల త్యాగాల ఫలితం ఈ స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు అనుభవిస్తున్నామని వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని సహదేవ్ నాయకులు పాశం సత్తిరెడ్డి,తుమ్మల శ్రీనివాస్,,సాయిని యాదగిరి,బత్తిని లింగయ్య,కాసుల వెంకన్న,ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు,యువజన సంఘాల నాయకులు,యువకులు, కార్యకర్తలు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు.

**(యాదాద్రి కరస్పాండెంట్ )దేశ టైమ్స్ ఆగష్టు 15.**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలో మండలంలోని వివిధ గ్రామాలలో, యువజన సంఘాల ఆధ్వర్యంలో 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో, పోలీస్ స్టేషన్లో, గ్రామపంచాయతీ కార్యాలయం తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ , ఎంపీడీఓ జలందర్ రెడ్డి, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

## బాగాయత్ పాఠశాలలో మృతి చెందిన విద్యార్థిని అలీనా కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే.

**(యాదాద్రి కరెస్పాండెంట్ ) దేశ టైమ్స్, ఆగస్టు 15.**




భువనగిరి పట్టణంలోని బాగాయత్ పాఠశాలలో ప్రమాదవశాత్తు చెట్టు కొమ్మ విరిగి పడి మృతి చెందిన విద్యార్థిని అలీనా కుటుంబాన్ని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేసి, ఓదార్చి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపి అలీనా కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు . కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారితో పాటు మున్సిపల్ ఛైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, గ్రంధాలయ చైర్మన్ అవేస్ చిస్తి, మున్సిపల్ వైస్ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మరిపెడ ఎం పి హెచ్ ఎస్ చార్యులు

**ఉత్తమ ఉద్యోగి ప్రశంసా పత్రం**

**(దేశటైమ్స్)మహబూబాబాద్/మరిపెడ, ఆగస్టు 15**



మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మల్టీ పర్పస్ హెల్త్ సూపర్వైజర్ గా విధులు నిర్వహిస్తున్న ఎన్.సి.హెచ్.ఎస్.వి.ఎస్. చార్యులు ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్నారు. దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ఆయన ఈ ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రాంచంద్రునాయక్ , జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ సంయుక్తంగా చార్యులుఈ అవార్డును అందజేసి అభినందించారు. వైద్య ఆరోగ్య శాఖలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలు, విధి నిర్వహణలో చూపిస్తున్న నిబద్ధతను గుర్తించి ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత చార్యులు మరిపెడ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి , ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. చార్యులుఈ అవార్డు రావడం తమ కేంద్రానికి ఎంతో గర్వకారణమని వైద్యాధికారి డాక్టర్ రవి పేర్కొన్నారు. తన విధి నిర్వహణలో చార్యులు ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజలకు మరిన్ని మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి కృషి చేస్తానని అవార్డు గ్రహీత చార్యులు ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. చార్యులు అవార్డు రావడం పట్ల స్థానిక ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వెల్వర్తి గ్రామంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆగస్టు 15 (దేశ టైమ్స్)**



వలిగొండ మండల పరిధిలోని వెల్వర్తి గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కల్కూరి రాములు పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతోమంది ప్రాణాల త్యాగం ఫలితంగా మనకు వచ్చిన స్వతంత్రాన్ని భావి భారత పౌరులు అమరులు తాగాలని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పిట్టల కుమార్, బూడిద స్వామి, నాయకులు చెవ్వ వెంకటేశం, నానమల ఉప్పలయ్య, కాసుల పెద్దలు, బూడిద పాపయ్య, గట్టు పాపయ్య, కడవెరి యాదగిరి, మల్లశీ నరేష్, కల్కూరి శ్రీను, చెవ్వ రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి మండల కేంద్రం లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**పదవీ విరమణ చేసిన ఆర్ఐ బద్ది దాసుకు ఘన సన్మానం**

**దేశ టైమ్స్**



మేడిపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల కుల సమైక్య మేడిపల్లి సంఘం ఆధ్వర్యంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గౌరవాన్ని చాటుకున్నారు. అనంతరం మేడిపల్లి గ్రామానికి చెందిన రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) బద్ది దాసు పదవీ విరమణ సందర్భంగా సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఆయన రెవెన్యూ శాఖలో అందించిన సేవలను కొనియాడుతూ శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బద్ది దాసుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేదరి ఆశీర్వాదం, మెట్టు విజయరావు, మెట్టు శ్రీనివాస్, మేకల రాజు, పెద్ద నరసయ్య, బద్ది అంజయ్య, మేదరి శ్యామ్, మెట్టు ప్రకాష్, చింతల మోహన్, దేవరాజ్, విద్యాసాగర్, మెట్టు వంశీ, మెట్టు శేఖర్, చేపూరి నాగరాజు, బలగం రాజేష్ తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో పాటు పదవీ విరమణ పొందిన ఆర్ఐ బద్ది దాసు ను సన్మానించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# వెలువర్తిలో మహా రక్తదాన శిబిరం

**హాజరైన సీఐ, ఎంపీడీవో, ఎస్సై**


**వలిగొండ ఆగస్టు15 (దేశ టైమ్స్)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం మహా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా రామన్నపేట సీఐ రవి, స్థానిక ఎంపీడీవో జలంధర్ రెడ్డి, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి లు హాజరై శిబిరాన్ని ప్రారంభించి వారు మాట్లాడుతూ వెలువర్తి గ్రామంలో మహా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన యూత్ అసోసియేషన్ సభ్యులకు అదేవిధంగా రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడే 32 మంది రక్త దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా సమాజానికి అవసరమయ్యే ఇలాంటి కార్యక్రమాలు చేస్తూ వచ్చే తరం యువతకు ఆదర్శప్రాయంగా ఉండాలని అభినందించారు. ఈ రక్తదాన శిబిరాన్ని యాదాద్రి తలసేమియా బ్లడ్ సెంటర్ భువనగిరి, యశోద హాస్పిటల్ మలక్ పేట్ డాక్టర్లచే హెల్త్ చెకప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్, గౌరవాధ్యక్షులు ఉక్కుర్తి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లం నరేష్, దాసబోయిన వెంకట్, బూడిద రాజు, ఉపాధ్యక్షులు వేముల మణికాంత్, ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కూచిమల్ల నాగేష్, కార్యదర్శి మల్లం మహేష్, మల్లం భాను, బుడిగె బాలకృష్ణ, ఇంజమూరి శేఖర్, కూచిమల్ల శ్రీకాంత్, ఎడవల్లి విజయ్, కూచిమల్ల నాగేంద్ర, కోశాధికారి మల్లం సాయి, సంస్కృతి కార్యదర్శి మల్లం వెంకటేశం, బూడిద కిషన్ కూచిమల్ల కుమార్, సహాయకార్యదర్శి కలుకూరి మహేష్, సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, వార్డు మెంబర్లు, సెక్రటరీ జి. గిరిబాబు, మాజీ యూత్ అధ్యక్షులు ఎడవల్లి నరసింహ, బైరు సైదులు, తుమ్మల వెంకటరెడ్డి, ముద్దసాని కిరణ్ రెడ్డి, కేర్చిపల్లి సర్పంచ్ మద్దెల మంజుల, కలుకూరి రాములు, కాసుల పెద్దలు, చెవ్వ వెంకటేశం, నానమాల ఉప్పలయ్య, గుండు శేఖర్, కలుకూరి లక్ష్మణ్, ఎల్లయ్య, బూడిద బిక్షం, మల్లం హరిప్రసాద్, ఎడవల్లి జయప్రకాష్, శామల కొండల్ రెడ్డి, చెవ్వ మధు, చెముడాల మల్లేష్, బూడిద రాజు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్**

**(దేశటైమ్స్)మహబూబాబాద్, ఆగస్టు 15:**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఘనంగా, దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమ ప్రాంగణం దేశభక్తి భావంతో మార్మోగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా వివరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

సమరయోధులకు ఘన సన్మానం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన పోరాటం, త్యాగాలు, సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. వారి సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

శాఖల ప్రగతిని చాటిన స్టాల్స్

వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, మత్స్య, గృహ నిర్మాణ, విద్య, రెవెన్యూ, పశుసంవర్ధక తదితర శాఖలు తమ పరిధిలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శనల ద్వారా ప్రజలకు వివరించాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందుతున్న సేవలను ఈ స్టాల్స్ ద్వారా అవగాహన కల్పించారు.

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కేసముద్రం కేజీబీవీ, టీజీఎస్ఆర్ఎస్, చిన్నగూడూరు కేజీబీవీ, ఆనంతారం మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల తదితర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశభక్తిని ప్రతిబింబించే ప్రదర్శనలతో విద్యార్థులు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులను ఈ సందర్భంగా గుర్తించి ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

జెడ్పీ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయంలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరీష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, జెడ్పీ సిబ్బందితో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు, ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ, వివిధ శాఖల అధికారులు, జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ

జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. దేశ స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ప్రజలంతా దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. జాతీయ పతాకావిష్కరణ, దేశభక్తి కార్యక్రమాలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, జిల్లా కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరీష్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్‌కుమార్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ పురుషోత్తం, డీఆర్ఓ నాగవాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280